క్లుప్తంగా

ఘనంగా వేణుగోపాలుడి కల్యాణం



నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో ఆదివారం స్వామి మాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలా చార్యులు, అర్చకబృందం సత్యభామ, రుక్మిణీ సమేత శ్రీవేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు, భక్తులు పాల్గొన్నారు.

యువతకు క్రికెట్ కిట్



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): గ్రేస్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యాన కేతనకొండలో ఆదివారం యువకులకు క్రికెట్ కిట్ అందజేశారు. సంస్థ డైరెక్టర్ మోగులూరి ఎలీషా మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు అబ్రహాం, చర్చి సంఘం పెద్దలు యోబు, మాణిక్యాలరావు, బాజీ, ప్రభుదాస్, హరీష్ పాల్గొన్నారు.

నేడు స్పందన

ఎ.కొండూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు పాల్గొంటారని ప్రజా సమస్యలపై అర్జీలు పెట్టుకుంటే వాటిని పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు.

కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కొణిజెర్ల(గంపలగూడెం): మండలంలోని కొణిజెర్ల బీసీ కాలనీలో నిర్మించిన ఆలయంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రూ. 30 లక్షల భక్తుల విరాళాలతో కాలనీలో ఆలయాన్ని నిర్మించారు. అర్చకులు నరసింహాచార్యులు ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

మారెమ్మ ఆలయంలో సూర్యహోమం

పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేలలో మారెమ్మ దేవస్థానంలో మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం సూర్యహోమం నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్‌బాబు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

నూజివీడు: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు పింఛన్‌కు సంబంధించి ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూజివీడు ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ వివరాలను వారి సొంత ఫోన్ ద్వారా గానీ, ఏదైనా నెట్ సెంటర్‌లో ఫోన్ యాప్ ద్వారా గానీ, పింఛన్ సీఎఫ్‌ఎంఎస్ నెంబరు, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నెంబరు సంబంధించి ఈకేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు. సీఎఫ్‌ఎంఎస్ నెంబరు తెలియని పెన్షనర్లు, ఫోన్ నెంబరు అప్‌డేట్ కాని వారు స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా పౌర్ణమి పూజలు

నూజివీడు: మాఘ పౌర్ణమి ప్రతి ఒక్కరిలో జ్ఞానాన్ని నింపాలనేదే శ్రీ విశ్వస్ఫూర్తి గురుదేవుల ఆకాంక్షని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక విశ్వ గురువు విశ్వస్ఫూర్తి దివ్య ఆశీస్సులతో నూజివీడు పట్టణంలోని సంఘం కాంప్లెక్స్‌లో ఆదివారం మాఘ పౌర్ణమి వేడుకలు స్ఫూర్తి కుటుంబం ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. మాఘ మాసానికి, మాఘ పౌర్ణమికి ఉన్న విశిష్టతను శ్రీ గురుదేవులు దివ్య సందేశంలో వక్తలు వివరించారు. దివ్య సందేశాన్ని ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కందుకూరి దీప్తి ప్రసన్న వినిపించారు. శ్రీ సత్య సంగీత నృత్య అకాడమీ నిర్వాహకులు వేంపాటి మోహన్, మరో అతిథి మల్లాది శ్రీనివాస నాగేశ్వర శర్మ మాట్లాడుతూ విశ్వస్ఫూర్తి బోధనలు వర్తమాన మానవాళికి ఎంతో అవసరమైనవన్నారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర అధ్యాపకులు డి.రవికుమార్, లయన్స్ క్లబ్ ప్రతినిధి పురాణం కృష్ణప్రసాద్, స్ఫూర్తి కుటుంబం ఏపీ ట్రస్టు సభ్యులు టీవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాగద్వేషాలకు అతీతంగా పాలన

- తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి
- పెనుగొలనులో ప్రభుత్వ భవనాల ప్రారంభం
- రూ.1.25 కోట్లతో నిర్మాణం



పెనుగొలనులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

పెనుగొలను(గంపలగూడెం): రాగద్వేషాలు, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలనులో రూ.1.25 కోట్ల వ్యయ అంచనాతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయ భవనాలు, రెండవ సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ వెల్నెస్ సెంటర్లతో పాటు రూ.8 లక్షల ఖర్చుతో ఆర్వో ప్లాంట్లను ఆయన ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు వెంటరాగా ఆయా భవనాల వద్దకు ర్యాలీగా వెళ్లి ప్రారంభించారు. దీంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన 44 నెలల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల మనసుల్ని గెలుచుకొన్నారన్నారు. వైఎస్సార్ సీపీపై నానాటికీ పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు నిరాధారమైన నిందలు మోపుతున్నారని తెలిపారు. ప్రతిపక్షాల విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. నాడు–నేడు పథకంతో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించి పేదలకు మెరుగైన విద్యనందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. పెనుగొలనులో వివిధ పథకాల ద్వారా రూ.4.20 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు.

రైతు భరోసా కేంద్రాలతో రైతులకు కావాల్సిన వ్యవసాయ సమాచారం, సౌకర్యాలు కల్పిస్తున్నారని, వైఎస్సార్ వెల్నెస్ సెంటర్ల ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ ఆశయం అభివృద్ధి తప్ప, ఎదుటివారిపై కక్షసాధింపు చర్యలు కావని స్పష్టం చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో ప్రజలు మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సి ఉందని కోరారు. గంపలగూడెం, విసన్నపేట ఎంపీపీలు గోగులమూడి శ్రీలక్ష్మి, వనజాక్షి, మూడు మండలాల జడ్పీటీసీ సభ్యులు శామ్యూల్, రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, పెనుగొలను, రాజవరం సర్పంచ్ లలిత, నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు ఓడ్డెబోయన శ్రీను, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు చెన్నకేశవరెడ్డి, నర్సారెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ బి.రాణి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, వైస్ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె.దాసు, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ చైర్మన్లు, పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెనుగొలనులో వైఎస్సార్ విగ్రహావిష్కరణ



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రక్షణనిధి

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను బోటు ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆయన చేపట్టిన ఎన్నో ప్రజాసంక్షేమ పథకాలు ఇప్పటికీ దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, సర్పంచ్ సంగెపు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఒడ్డెబోయిన శ్రీను, పార్టీ మండల అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● 'తలశిల'కు పరామర్శ



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి అనారోగ్యంతో మృతి చెందడంతో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం గొల్లపూడిలోని రఘురామ్ నివాసానికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. స్వర్ణకుమారి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

230 మందికి వైద్య పరీక్షలు



లోపూడిలో ఉచిత గుండె, నేత్ర వైద్య శిబిరం

ముసునూరు: స్థానికంగా 230 మందికి ఉచితంగా గుండె, నేత్ర వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేసినట్లు లోపూడి గ్రామానికి చెందిన సత్య మెడికల్స్, సత్య క్లినికల్ ల్యాబ్ అధినేతలు చలమాల గంగాధర్, సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని లోపూడి సచివాలయ సెంటర్ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద ఏలూరుకు చెందిన విజయ హాస్పిటల్స్ రితేష్ హార్ట్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా గుండె, నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. గుండె వైద్య నిపుణులు రితేష్ 60 మందికి హృదయ సంబంధ పరీక్షలు చేశారు. నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ తేజస్వి 140 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, 60 మందికి కళ్లజోళ్లు, 80 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి మంగళవారం శుక్లాల ఆపరేషన్లు చేయిస్తామని ఆర్గనైజర్లు తెలిపారు.

సారా నిర్మూలనపై అవగాహన సమావేశం

తెల్లదేవరపల్లి (విస్సన్నపేట): సారాతో అనర్థాలు సంభవిస్తాయని సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మైలవరం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తెల్లదేవరపల్లిలో ఆదివారం సారా నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి తీర్మానాన్ని ఆమోదించారని తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ బి. గురవయ్య, డీటీఎఫ్ మైలవరం ఎస్ఐ సీహెచ్ వెంకటకుమార్, మాజీ సర్పంచ్ దారావతు శ్రీను, వార్డు సభ్యులు రాయల సురేష్ పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణకు ప్రత్యేక కేంద్రాలు

తిరువూరు: ఆధార్ నవీకరణకు ఈ నెల 7 నుంచి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తిరువూరు తహసీల్దార్ సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న చింతలపాడులో, 8న కొత్తూరులో, 9న ఎర్రమాడు, 10న లక్ష్మీపురంలోని సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధార్ నమోదు చేసి 15 సంవత్సరాలు దాటినవారు తమ వివరాలు ఆధునికీకరించుకోవాలని సూచించారు.

అవగాహనతో క్యాన్సర్ నియంత్రణ

తిరువూరు: మద్యపానం, ధూమపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటే క్యాన్సర్ వ్యాధి దరి చేరదని క్యాన్సర్ చికిత్స నిపుణులు శ్రావణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ వ్యాధి నివారణ దినోత్సవ సందర్భంగా ఆదివారం తిరువూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన సుందరయ్య భవన్లో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు జరిగింది. వ్యాయామం, సరైన ఆహార అలవాట్ల ద్వారా క్యాన్సర్ నియంత్రించవచ్చని, వైద్యసేవలు కూడా విస్తృతంగా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మహిళల్లో వచ్చే క్యాన్సర్ వ్యాధి కారకాలను, నివారణ చర్యలను డాక్టర్ వల్లభనేని రవీంద్ర వివరించారు. జనవిజ్ఞాన వేదిక ద్వారా క్యాన్సర్‌పై అవగాహన పెంపొందిస్తామన్నారు. జేవీవీ ప్రతినిధులు పాపారావు, గంగాధర్, సుదర్శన్, హరికృష్ణ, శరత్, రాంప్రదీప్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ముసునూరు కన్వీనర్ల సదస్సులో జెడ్పీటీసీ ప్రతాప్, నేతలు

ముసునూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేద్దామని మండల సచివాలయాల కన్వీనర్, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్ సూచించారు. మండల కేంద్రం ముసునూరులో ఆదివారం గ్రామ పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ తులిమెల్లి సుబ్బారావు అధ్యక్షతన గ్రామ సచివాలయాల కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పథకాలను అందించి, అవగాహన ఏర్పరచి, పార్టీ బలోపేతానికి పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు చీలి లక్ష్మీ అర్జప్ప, తులిమెల్లి కృష్ణకుమారి, సొసైటీ అధ్యక్షుడు మానికల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, మండల యూత్ అధ్యక్షుడు గూట్రు రంగారావు, మాజీ సర్పంచ్ రేగుల గోపాలకృష్ణ, మండల యూత్ మాజీ అధ్యక్షుడు తులిమెల్లి రంగారావు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, పార్టీ నేతలు, పాల్గొన్నారు.

సంక్షిప్తం

● నేడు చనుబండలో నేత్ర వైద్య శిబిరం

చాట్రాయి: మండలంలోని చనుబండలో సోమవారం భగవాన్ శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు జె.రంగారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నూజివీడు అమెరికన్ ఆస్పత్రి సహకారంతో ఉదయం 10 గంటలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షలు చేయించుకునేవారు దుప్పటి, ప్లేటు, ఆధార్ కార్డు, దుస్తులు తీసుకు రావాలని సూచించారు.

● గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత



ముసునూరు: ముసునూరు గ్రామానికి చెందిన కొడవలి జ్యోతి గుంటూరు జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె తన స్వగ్రామానికి వచ్చి వితంతు పింఛన్ అందుకోలేని పరిస్థితి ఎదురైంది. దీంతో వలంటీరు రంగమ్మ ఆదివారం గుంటూరు చేరుకుని పింఛన్‌దారును పరామర్శించి, నగదు అందజేశారు. వలంటీరును జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీటీసీ చీలి లక్ష్మీ అర్జప్ప, మాజీ సర్పంచ్ రేగుల గోపాలకృష్ణ, మండల, గ్రామ వైఎస్సార్ సీపీ నేతలు అభినందించారు.

● శివరాత్రికి సన్నాహక పూజలు

జి.కొండూరు: స్థానిక శేషగణపతి దేవాలయంలో ఈ నెల 18న శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి సన్నాహక పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయంలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు రోలులో పసుపును కొట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● అలరించిన నాటికలు



మైలవరం: స్థానిక ద్వారకా తిరుమల దత్తత దేవాలయం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి తిరు కల్యాణ మహోత్సవం ప్రారంభమైంది. శ్రీస్వామివారి తిరు కల్యాణాన్ని ఆలయ ధర్మకర్త, మైలవరం జమీందారు ఎస్వీ సుధాకర రావు ప్రారంభించారు. శ్రీతిరుకల్యాణ మహోత్సవంలో భాగంగా మైలవరం శ్రీబాల భారతీ నాట్య మండలి నిర్వహణలో నాటకోత్సవాలను నటరాజ పూజతో జ్యోతి ప్రజ్వలన చేసి జమీందారు తనయుడు ఎస్వీ నివృతరావు ప్రారంభించారు. మొదటి రోజు మొదటి ప్రదర్శన జనచైతన్య, ఒంగోలు వారి చేతిరాత నాటిక ప్రదర్శించారు. రెండవ ప్రదర్శన హర్ష క్రియేషన్స్, విజయవాడ వారి స్వర్ణ కమలాలు నాటిక ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకున్నారు.

● కోదండ రాముడికి ప్రత్యేక పూజలు

తిరువూరు: స్థానిక శ్రీకోదండ రామాలయ పునర్నిర్మాణ అనంతరం ఆదివారం విగ్రహ పునఃప్రతిష్ఠా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితులు దివి ఉదయకుమారాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 9.15 గంటలకు శ్రీసీతారామ లక్ష్మణులు, ఆంజనేయస్వామి విగ్రహాలను, నూతన ధ్వజస్తంభాన్ని, సుదర్శన నారసింహ చక్ర, విమాన శిఖరాలను ప్రతిష్ఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. దేవాలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యాన భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ ప్రతినిధులు సోమవరపు సత్యనారాయణరావు, కొల్లిపర సుబ్బారావు, కంచర్ల ముత్యప్రసాద్, గజ్జల సీతారామారావు తదితరులు పర్యవేక్షించారు.

● విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్ దగ్ధం



ముష్టికుంట్ల(తిరువూరు): విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్ దగ్ధమైన ఘటన ఆదివారం మండలంలోని ముష్టికుంట్లలో జరిగింది. ముష్టికొండలో తోటకూర బాబుకు చెందిన వరిగడ్డిని ట్రాక్టరుపై తరలిస్తుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి మంటలు లేచాయని గ్రామస్తులు తెలిపారు. అగ్నికి ట్రాక్టరు గడ్డితో సహా కాలిపోగా, తిరువూరు అగ్నిమాపక దళం మంటలను అదుపు చేసింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

● సాయి మందిరంలో నందా దీపోత్సవం



గంపలగూడెం: గంపలగూడెంలో సాయిబాబా ధ్యాన నిలయంలో నందా దీపోత్సవం ఆదివారం రాత్రి నిర్వహించారు. తొలుత సాయినాథుడికి అర్చకులు కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు జరిపారు. ప్రతి పౌర్ణమి నాడు ధ్యాన నిలయంలో నందా దీపాలతో దీపోత్సవం నిర్వహిస్తారు. బాబా చిత్రపటానికి ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఉంచి భక్తులు మోసుకుంటూ నందా దీపాలను చేతబూని ధ్యాన నిలయం చుట్టూ ప్రదర్శనలు నిర్వహించారు.

● విద్యార్థులకు ప్రోత్సాహక పారితోషికం

విస్సన్నపేట: ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు కోపా ఆధ్వర్యాన ప్రోత్సాహక పారితోషికం అందజేశారు. స్థానిక వికాస్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఎయిడ్ ఫర్ పూర్ చారిటబుల్ ట్రస్ట్ విస్సన్నపేట, కృష్ణదేవరాయ పేద బలహీన వర్గాల సహాయనిధి గుంటూరు ఆధ్వర్యాన తొమ్మిది మండలాల్లో ప్రతిభావంతులైన 227 మంది విద్యార్థినీ విద్యార్థులకు రూ.7.04 లక్షలు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ దాసరి రామారావు, కోపా ట్రస్ట్ డైరెక్టర్ కార్యదర్శి ఎరుబండి వెంకట కృష్ణారావు, ట్రెజరర్ తుంగల నరేంద్ర ,ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

● రోడ్డు ప్రమాద మృతుడి వివరాలు లభ్యం

జి.కొండూరు: చెవుటూరు శివారులోని 30వ నంబరు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన వ్యక్తి వివరాలు లభించాయి. మృతుడు ప్రకాశం జిల్లా కనిగిరి మండలం చాకిరాల గ్రామానికి చెందిన మాలపాటి నారాయణరెడ్డి(62)గా పోలీసులు గుర్తించారు. నారాయణరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య, కుమారుడితో కలిసి ఏడేళ్లుగా విజయవాడలో నివసిస్తున్నాడు. ఓ ఫంక్షన్ హాల్లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అయితే నారాయణరెడ్డికి అప్పుడప్పుడు మతి స్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోయేవాడు. ఈ నెల ఒకటో తేదీన పింఛన్ తీసుకునేందుకు చాకిరాలకు వెళ్లి తిరిగి విజయవాడ రాలేదు. మతి స్థిమితం సరిగ్గాలేని నారాయణరెడ్డి విజయవాడ వెళ్లకుండా జి.కొండూరు వైపు వచ్చి మండల పరిధిలోని చెవుటూరు గ్రామ శివారులో ప్రమాదానికి గురై మృతి చెందాడు. మీడియా ద్వారా తన తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న మృతుడు కుమారుడు వెంకటరెడ్డి ఆదివారం జి.కొండూరు పోలీసులను సంప్రదించాడు. పోస్టుమార్టం అనంతరం నారాయణరెడ్డి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అందజేశారు.